## ముందు మాట

యోనిత్యమచ్యుత పదాంబుజ యుగ్మరుక్మ వ్యామోహతః తదితరాణి తృణాయమేనే

అస్మత్ గురోః భగవతః అస్య దయైకసింధోః

రామానుజస్య చరణౌ శరణమ్ ప్రపద్యే

కాశ్యపాన్వయ సంజాతమ్ శరణ్యార్య పదాశ్రితమ్

వైరాగ్యజలధిమ్ వందే రంగరామానుజమ్ మునిమ్

వాధూల వంశ సంజాతమ్ కోదండరామ సుప్రజమ్

వేదాంత సాగరమ్ వందే

శ్రీవేంకటేశ దేశికమ్

ామాయణ రహస్యజ్ఞమ్ రమ్యవాక్య విశారదమ్

అనంత గుణసంఘాతమ్ అప్పలార్యమహమ్ భజే

శ్రీవాత్స్య వరదాచార్య పౌత్రమ్ తత్పద సంశ్రయమ్

తాతార్య తనయమ్ వందే రఘునాథాహ్వాయమ్ గురుమ్

కౌండిన్యాన్వయ సంభూతమ్ అప్పలార్య పదాశ్రితమ్

వేదాంతద్వయ తత్త్వజ్ఞమ్ శ్రీనివాస గురుమ్ భజే

## దర్శనములు - మతములు

మనమందరమూ దుఃఖాలు పోయి సుఖంగా ఎలా ఉండడం అని దారులు వెతుకుతూంటాము కదా! వీటినే అనిష్ట నివృత్తి, ఇష్ట ప్రాప్తి అని మన పెద్దలంటారు. అయితే ఈ దారులు వెదికే ప్రయత్నము ఈనాటిది కాదు. మన జీవులందరము బ్రతుకు తెలివి మొదలు పెట్టిన నాటి నుండి ఈ ప్రయత్నము మొదలయింది. ఇలా ఒక మంచి బ్రతుకు కోసం దారి చూపించే జ్ఞానాన్ని దర్శన జ్ఞానమని అలా చూపించేవాటిని దర్శనాలనీ అంటారు.

మన భారతావని అదృష్ట మేమిటంటే మన మహర్షులు తపించి, దర్శించి మనకందిచ్చిన అనంతమైన వేదరాశి.

కాని ఈ వేదాలను నమ్మక స్వతంత్రంగా పుట్టి, నిల్చిన దర్శనాలు కొన్ని ఉన్నాయి. దర్శనాలలో తర్కానికీ, జ్ఞానానికీ, హేతు బద్ధతకూ ప్రాధాన్యత ఉంటుంది. అయితే అలాకాకుండా కొందరు మహానుభావుల అనుభవ జ్ఞానాల ఆధారంగా బయలుదేరి విశ్వాస ప్రాతిపదికతో అనుష్ఠానానికీ, ఆచరణకు పెద్ద పీట వేస్తే వాటిని మతాలంటాము. కొన్ని అంటే విశిష్టాద్వైతం లాంటివి మతాలు, దర్శనాలూ కూడా అవవచ్చు ననుకోండి. వేదాలను అంగీకరిస్తే ఆస్తిక దర్శనాలూ, ఆస్తిక మతాలూ అని, అలాకాకుండా అంగీకరించక పోతే నాస్తిక దర్శనాలూ, నాస్తిక మతాలూ అని అంటారు.

పైన అనుకున్నట్లు వేదములను నమ్మకుండా తా మునిగింది గంగ, తా వలచింది రంభ అన్న వాళ్ళు కొంతమంది. అంటే ప్రాపంచిక ఇంద్రియ భోగాలను అనుభవించడమే జీవిత లక్ష్యమని, అది తప్ప మఱేమీ పట్టించు కొననక్కరలేదని అనుకున్నవారూ ఉన్నారు. వీరిలో ముఖ్యమైనవారు ఱెండు రకాలు. పాషండులు, చార్వాకులు అని. వీరిని లోకాయతులని కూడా అంటారు. వీరిలో ఒకరు స్వంత సుఖాలకు మాత్రమే గుర్తింపు నిస్తే మఱి యొకరు సుఖంగా కలసి మెలసి మంచిగా మాటలాడుకుంటూ బతుకుదామన్నవారు. బృహస్పతి ఈ దర్శనాన్ని ప్రతి పాదించేడంటారు. వీరు తమ ఇంద్రియాలకు తెలియబడే జ్ఞానానికే ప్రాధాన్యత ఇస్తారు.

ఇంద్రియాల నుండే కాకుండా జ్ఞానము తెలుసుకుందికి మఱి కొన్ని సాధనాలు, విధానాలు కూడా ఉన్నాయని పెద్దలంటారు. లోకంలో ఏ వస్తువుకి ఎట్టి వ్యవహారమున్నదో అట్టి వ్యవహారమును సమంగా తెలిపే జ్ఞానాన్ని

యథావస్థిత వ్యవహారానుగుణ జ్ఞానము అని అంటారు. దీనని తెలుసుకొనుటకు సాధనములు ప్రమాణములు.

లైంగికత్వ శాబ్దత్వ స్మృతిత్వ రహితమైన సాక్షాత్కార ప్రమాపణము ప్రత్యక్షము అనే ప్రమాణము. సులభంగా చెప్పాలంటే ఇంద్రియ గ్రాహ్యము అని అనుకోవచ్చు. కనబడుతున్న నిప్పును చూసి ఇది నిప్పు అని తెలుసుకోవడం.

అలా కాక ఒక హేతువుచే ఒక సాధ్యమును తెలుసుకుంటే అంటే కొండపై పొగ ఉన్నది కనుక పొగ ఉన్న చోట నిప్పుంటుంది కనుక కొండపై నిప్పు  ఉన్నది అని అనుకోవడం అనుమితి లేదా అనుమానము అనే ప్రమాణము.

పరమ పురుషులైన ఒకరి ఆప్త వాక్యము వలన, లేదా అపౌరుషేయాలయిన వేదాల వలన తెలుసుకుంటే అది శబ్ద ప్రమాణము.

ఇవే కాకుండా ఉపమానమనీ, అర్థాపత్తి అనీ, అనుపలబ్ధి అనీ ఇలా మఱికొన్ని ప్రమాణాలు వివిధ దర్శనకారులు పేర్కొంటుంటారు. కాని ముఖ్యమైన ప్రమాణాలు ప్రత్యక్ష, అనుమాన, శబ్ద ప్రమాణాలే.

ఇదంతా ఎందుకు వచ్చిందంటే లోకాయతులు ప్రత్యక్షం తప్ప మఱియొక ప్రమాణము లేదంటారు కనుక వారికి దేవుడు, పై లోకాలూ, చని పోయిన తరువాత మోక్షమూ ఇవేమీ ఉండవు.

కాని మిగిలిన దర్శనాలూ, ఇంకా మతాలూ కూడా సుమారుగా ఇంద్రియ విషయానుభవము ఎప్పుడూ పూర్తిగా అనిష్ట నివృత్తి కల్గించి శాశ్వతమైన ఆనందమును ఈయదని నమ్మినవారే. అలా దుఃఖాలు లేకుండా ఉండే స్థితి లేదా గొప్ప ఆనందము కలిగే స్థితి ఒకటుంటుందని దానిని మోక్షమంటారని మిగిలిన వాళ్ళు చాలావరకు ఒప్పుకుంటారు, కాని ఇలాంటి స్థితి ఎలా పొందడం అన్న విషయంలో మాత్రం విభేదాలున్నాయి.

ఇలాంటివి పైన అనుకున్నట్లు కొన్ని వేదాలను అంగీకరించినవి, కొన్ని అంగీకరించనివి.

వేదాలను అంగీకరించని, మనదేశంలో ప్రచారం పొందిన మతాలూ ఉన్నాయి. వానిలో బౌద్ధమూ, జైనమూ ముఖ్యమైనవి.

అందులో బౌద్ధము మన దుఃఖాలకు కారణం ప్రాపంచిక విషయానుభవము అని, అందు వలన ఈ విషయానుభవాన్ని క్రమక్రమంగా తగ్గించుకుంటూ చివరకు దుఃఖ శూన్యమైన స్థితికి చేరుకోవడమే మోక్షమని చెబుతారు. వీరి ప్రకారము ఈ కనపడేదంతా క్షణికము, ఆత్మ క్షణికమే, పునర్జన్మలుంటాయి. కాని సర్వమూ

చివరకు శూన్యము. అందుచేత ఆత్మ, పరమాత్మ కూడ ఉండడు వీరి మతంలో మనం చేయవలసినది  దుఃఖ నిరోధమే. వీరికి ప్రత్యక్షము, అనుమానమూ కూడా ప్రమాణాలే. ఈ మత ప్రవక్త గౌతమ బుద్ధుడు

ఇంక జైన మతం ఆత్మను నిత్యమని ఒప్పుకుంటుంది. కాని పరమాత్మనుకాదు. మనం పుణ్య చేస్తూ అలోకాకాశము అంటే మోక్షమార్గము నందు పయనించి ప్రకాశస్థితిని పొందడమే లక్ష్యము. వీరి మతంలో జీవం, అజీవం అని రెండున్నాయి. ఇవి మామూలుగా కలసి ఉంటాయి. ఎప్పుడు అజీవంనుండి జీవం విడివడుతుందో అప్పుడే ఆత్మ కు మోక్షము అన్నమాట. అలాకాకుండా పాప కర్మలు చేసేవారు ఈ సంసారంలో ఇంకా దిగువకు పోతూ ఇంకా దుఃఖాలను అనుభవిస్తూంటారు. ఈ మతాన్ని ఆవిష్కరించినది ఋషభుడంటారు.

ఇంక ఆస్తిక దర్శనాలలో ముఖ్యమైనవి సాంఖ్యము, యోగము, న్యాయము, వైశేషికము, పూర్వ మీమాంస, ఉత్తర మీమాంస

సాంఖ్యదర్శనమును అందిచ్చినది కపిల మహర్షి. ఈయన మొత్తము 24 ప్రకృతి తత్త్వాలు నిర్వచించి 25 వ తత్త్వము పురుషునిగా చెప్పేరు. పరమాత్మను అంగీకరించలేదు వీరు. ఇది వైదిక దర్శనమే అయినా వేదాల పట్ల ముభావంగానే ఉంటుంది, అంటే వేదాన్ని పూర్తిగా స్వీకరించినట్లు కనపడదు. జ్ఞానము అంటే సాంఖ్యము వలన పురుషుడు తాను ప్రకృతికి భిన్నమని తెలుసుకొని కైవల్యస్థితి (శాశ్వత ఆనంద స్థితి) పొందడం మోక్షం వీరి ఉద్దేశ్యంలో.

యోగ దర్శనం పతంజలి మహర్షి ప్రవచించింది. అష్టాంగ యోగము(యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ,ధ్యాన, సమాధులు) ద్వారా ఆత్మ కైవల్యస్థితి పొందుతుంది అని వీరు చెబుతారు.

న్యాయ దర్శనము చెప్పింది అక్షపాద గౌతముడు. ఈ కనబడే జగత్తంతా కార్యమనీ, దీనికొక కారణముంటుందనీ వీరు నమ్ముతారు. తత్త్వ జ్ఞానం వలన మిథ్యా జ్ఞానం నశిస్తుంది. అందువలన రాగ ద్వేషాలు పోతాయి. అప్పుడు కర్మ ప్రవృత్తి పోయి, జన్మనాశం వలన మోక్షం లభిస్తుందని వీరు అంటారు. మనకు తర్కము, హేతువాదము అందిచ్చినది ఈ న్యాయ దర్శనము. వీరు ప్రత్యక్ష, అనుమాన, శబ్ద ప్రమాణాలతో బాటు ఉపమానాన్ని కూడా ప్రమాణంగా అంగీకరిస్తారు. ఎందుకంటే హేతువాదము న్యాయము ఈ ఉపమానం మీద ఎక్కువ ఆధారపడి ఉంటుంది. ఆత్మ, శరీరము, ఇంద్రియాలు,విషయాలు, బుద్ధి, మనస్సు, అహంకారం, కర్మ, దోషం, జన్మ,ఫలం, దుఃఖానుభూతి, మోక్షం వీటి గురించి చెప్పి ఇవి సరి అయిన జ్ఞానమునకు మూలమని చెబుతారు.

కణాదుడు పదార్థాలన్నీ పరమాణు నిర్మితాలనీ ఆపరమాణువులు అవిచ్చిన్నాలనీ, కళ్ళకు కనపడనివనీ ఈ ప్రపంచమంతా ఆయా పరమాణువుల సంయోగము వలన తయారయినదనీ చెబుతాడు. ఈయనది వైశేషిక దర్శనము. 4 పదార్థాలనీ (భూమి, నీరు, గాలి, నిప్పు) వాటి వలన మిగిలిన వస్తువులన్నీ తయారయాయని ఆయన సిద్ధాంతము. దుఃఖ నివృత్తి ఈశ్వరుని వలన అది శ్రవణ, మనన, నిది ధ్యాసనాల వలన పదార్థ వివేక జ్ఞానం వలన కలుగుతుంది వీరి ప్రకారము.

పూర్వ మీమాంస చెప్పినది జైమిని. ఇది వేదాలలో పూర్వభాగమైన కర్మకాండను ఆధారము చేసుకొని ఉంటుంది.

వేదాలలో పూర్వ భాగాన్ని కర్మ కాండ అనీ ఉత్తర భాగాన్ని బ్రహ్మ కాండ లేదా ఉపనిషత్తులు అని అంటారు. వైదిక కర్మల యజ్ఞాల విధి, విధానాలు చెప్పేది వాటి ఫలితాలు తెలిపేది మీమాంసా దర్శనము. మీమాంస అంటే విచికిత్స, విశ్లేషణ అని అనుకోవచ్చు. మీమాంసా దర్శనానికి భాషా జ్ఞానము ఎక్కువ అవసరమయింది. ధర్మం, మంచి కర్మలు చేయడం ముఖ్యము. వీరి ప్రకారము కర్మ వలననే ఫలితము వస్తుంది కనుక పరమాత్మతో పనిలేదు. వీరిలో కూడా ముఖ్యంగా ప్రాభాకరులు భాట్టులు అని రెండు వర్గాలున్నారు. ప్రాభాకరులు ప్రత్యక్ష, అనుమాన, శబ్ద ప్రమాణాలతో బాటు ఉపమానము, అర్థాపత్తులను నమ్మితే భాట్టులు అనుపలబ్ధిని కూడా పరిగణిస్తారు. ( రాముడు స్థూలంగా ఉంటాడు పగలు తినడు అన్న దానిని బట్టి రాత్రి తింటాడు అని తెలుసుకోవడం అర్థాపత్తి, ఒక వస్తువు అభావమును అంటే లేక పోవడం తెలుసు కోవడం అనుప లబ్ధి) . ఒక యజ్ఞం చేస్తే దాని వలన అపూర్వం అని ఒకటి బేంకులో ఎకౌంట్ లా పుడుతుంది. ఆ అపూర్వం ఖర్చవుతూంటే మనకు కర్మ ఫలం వస్తుంది. ఆ అపూర్వం కూడా ఖర్చయి పోగానే కర్మ ఫలం పూర్తయిపోతుంది. కనుక పరమాత్మ వలన ఇష్టప్రాప్తి కలుగదుకనుక పరమాత్మ తో పని లేదు. నిష్కామ కర్మలు చేసినప్పుడు పుట్టే నిత్యాపూర్వం మాత్రం సంసార బంధం నుండి విడి వడేట్లు చేసి ఆత్మ స్వరూప జ్ఞానం కలిగేటట్లు చేస్తుంది. అదే మోక్షం.

ఉత్తర మీమాంస వేదాలలో బ్రహ్మ అంటే పరమాత్మ గూర్చి, ఆయనతో మనకు సంబంధము గూర్చి, మోక్షావస్థ గూర్చి వివరంగా తెలిపే ఉత్తర భాగములైన ఉపనిషత్ లకు ప్రాధాన్యత నిచ్చే దర్శనము. దీనిలోకూడా చాలా వర్గాలున్నాయి. అందులో ముఖ్యమైనవి అద్వైతము, విశిష్టాద్వైతము, ద్వైతము.

అద్వైతాన్ని అందిచ్చినది శంకర భగవత్పాదులు. వీరి ప్రకారము ఉన్న తత్త్వము ఒక్కటే. అదే బ్రహ్మ. ఆ బ్రహ్మ సర్వ విశేష శూన్యమైన చిన్మాత్రము.

ఈ కనపడే సర్వ ప్రపంచము మిథ్యా భూతమైనది. మిథ్య అంటే మొదట తానున్నట్లు భాసించి వస్తు జ్ఞానాన్ని తప్పుగా ఇచ్చేది, పిదప యథావస్థిత వస్తు జ్ఞానముచే అంటే నిజమైన జ్ఞానంవలన నివర్తము అనగా తొలగి పోయేది అని అర్థము. ఉదాహరణకు ఒక త్రాడు పాములా ముందు కనపడి త్రాడు అని తెలిసిన తరువాత ఆ పాము అనే జ్ఞానము తొలగి పోతుంది కదా! అదే మిథ్య.

ఈ కనపడేదంతా మఱిలా భాసించడానికి కారణము అవిద్య. స్వరూప తిరోధానము చేసి విచిత్రములైన, వివిధములైన వస్తు భ్రమ కలిగించునది అవిద్య. అనగా ఉన్న త్రాడు స్వరూపమును మఱుగు పరచి అచ్చట పామును కల్పించి చూపించేది అవిద్య.

సాధనా చతుష్టయము వలన (నిత్యా నిత్య వివేక జ్ఞానము, ఇహాముత్ర ఫలభోగ విరాగము, శమ దమాది సాధన సంపత్తి, ముముక్షుత్వము అంటే మనకీ కనపడే ప్రపంచమంతా అనిత్యమని, బ్రహ్మ ఒక్కటే నిత్యమనీ, సత్యమనీ తెలుసుకొని, ఈ లోకంలో కాని యజ్ఞ యాగాదుల వలన కలిగే పరలోకంలోగానీ పొందే విషయసుఖానుభవాలు తాత్కాలికములవడం వలన వాటిపై వైరాగ్యము కలిగి, బాహ్య, అంతర ఇంద్రియ నిగ్రహ సాధనతో మోక్షేచ్ఛకలిగి బ్రహ్మ అంటే ఏమో తెలుసుకొని ఆ బ్రహ్మ, నేను ఒకటే నేను వేరు కాదు అన్న విషయాన్ని ధ్యానిస్తూ బ్రహ్మానుభవ స్థితిని పొందడమే మోక్షము. కనపడేదంతా అసత్యము కనుక బ్రహ్మ ఇది కాదు, ఇదికాదు అని తెలుసుకుంటూ (నేతి, నేతి అని) చివరకు బ్రహ్మైక్యమును సాధించాలి.

ఇందులో బ్రహ్మ చింతన ప్రారంభించిన తరువాత కర్మలతో పని లేదు. అందు వలన వేదాలలో కర్మకాండ అవసరము లేదు.

అలాగే వేదాలలో ఉండే అభేద శ్రుతులు అంటే బ్రహ్మ, జీవుడు ఒక్కటే అనే శ్రుతులు మాత్రం పరిగణిస్తూ భేద శ్రుతులు అంటే బ్రహ్మ, జీవుడు వేరు అని చెప్పే శ్రుతులు, ఘటక శ్రుతులు అంటే బ్రహ్మ, జీవుడు కలసి ఉంటారని చెప్పే శ్రుతులు పరిగణనలోనికి తీసుకోరు.

బ్రహ్మ నిర్విశేష చిన్మాత్రము కనుక బ్రహ్మకు ఏ విశేషణములు కాని, లక్షణములు కాని, ఆకారము కాని ఏమీ ఉండవు. మనము జీవించి ఉన్నప్పుడే ఈ బ్రహ్మవస్థను పొందు స్థితిని జీవన్ముక్తావస్థ అంటారు.

విశిష్టాద్వైతంలో తత్త్వాలు మూడు. బ్రహ్మ, జీవుళ్ళు, ప్రకృతి. ఈ మూడు తత్త్వాలూ సత్యాలే. కనపడేదంతా, చివరకు స్వప్నంలో కనపడేది కూడా సత్యమే. (అన్ని పదార్థములు పరమాత్మ చే ఏదో ఒక ప్రయోజనముకై సృజింపబడినవి కనుక అవి అసత్యములు కావు) బ్రహ్మ కళ్యాణ గుణ పూర్ణుడు, హేయగుణ ప్రత్యనీకుడు. జ్ఞాన ఆనంద స్వరూపుడు, జ్ఞాన ఆనందములు గుణములుగా నున్నవాడు.

ఈ కనపడే జగత్తు సత్యమైనది. పరమాత్మ సంకల్పము చేత జీవుళ్ళ కర్మ క్షయానికి సృష్టింపబడినది. ఆయనను చేరి ఆయన సహవాసములో కైంకర్యానందము ఎల్లప్పుడూ అనుభవిస్తూండడం మోక్షము.

కర్మలు అవసరము. కర్మలు అనంతమైన, కాల పరిచ్ఛేదము లేని ఫలాలు ఈయలేవు కనుక దాని కోసం బ్రహ్మ జిజ్ఞాస ను ఆరంభించి బ్రహ్మ స్వరూపాన్ని, మన స్వరూపాన్ని, మన మాయనకు శేషులమని, పరతంత్రులమని తెలుసుకొని, భక్తితో ఆయనకు లక్ష్మీ పురస్సరంగా శరణాగతి చేసి, ఆయన ఆనందంకోసం శాస్త్రానుసారం వర్ణాశ్రమ విహితమైన కర్మలు చేయాలి. ఆయన మనపై కరుణించినప్పుడు ఆయన మనకు మోక్షాన్ని ఇస్తాడు. అంటే మిగిలిన దర్శనాలలో మనం మన కర్మ వలననో జ్ఞానము వలననో పొందుతామనే మోక్షం వీరి ప్రకారం అది పొందడం మన చేతులలో లేదు ఆయన కరుణించి కటాక్షిస్తే తప్ప.

వీరు వేదాలలో అభేద శ్రుతులు, భేద శ్రుతులు, ఘటక శ్రుతులు అన్నిటినీ పరిగణనలోనికి తీసుకొంటారు. జీవ, ప్రకృతి తత్త్వాలు పరమాత్మతో ఎప్పుడూ కలసి ఉంటాయని, వాటి సంబంధము శరీర, శరీరి సంబంధంతో ఉంటాయనీ అంటారు. అంటే ఆత్మ లేకుండా శరీరం ఉండలేనట్లు జీవ, ప్రకృతులు పరమాత్మ లేకుండా ఉండలేవు. పరమాత్మ వాటిల్లో అంతర్యామిగా ఎప్పుడూ ఉంటాడు.

మోక్షము ఈ లోకాలలో కుదరదు. మోక్షము పొందేది పరమపదము అనే పరమాత్మ వేంచేసి యుండెడి నిత్య విభూతి లోనే.

శ్రీమన్నారాయణుడు.  ఆయన పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చారూపాలతో తన భక్తులను ఆనందింప చేస్తాడు. ఆయనను నవవిధ సంబంధాలతో అనభవించి ఆనందించిన ఆళ్వార్లు మార్గదర్శకులు. ఈ విశిష్టాద్వైతాన్ని వెలికి తెచ్చిన వారు భగవద్రామానుజులు.

ద్వైతంలో కూడా మూడు తత్త్వాలు. బ్రహ్మ, జీవుళ్ళు, ప్రకృతి అని. అయితే విశిష్టాద్వైతంలో జీవుళ్ళ లక్షణాలు ఒక్కలాగే ఉంటే ద్వైతంలో జీవుళ్ళందరూ ఒక్కలా ఉండరు. వాళ్ళలో వారి పూర్వ కర్మానుభవాల బట్టి హెచ్చుతగ్గులుంటాయి. అందుకే కొందరు దేవుళ్ళు, కొందరు మనుష్యులు, కొందరు క్రిమి కీటకాలు ఇలా రకరకాలుగా ఉంటారు. అలాగే జగత్తులో వస్తువులలో కూడా తేడాలుంటాయి.

అనగా బ్రహ్మ, జీవుడు వేరు, జీవుడు, జీవుడు వేరు, జీవుడు ప్రకృతి వేరు, ప్రకృతి బ్రహ్మ వేరు, ప్రకృతి లో వస్తువులూ వేరు వేరు అంటూ వైవిధ్యాన్ని నిర్దేశించేది ద్వైతము. పరమాత్మ ద్వైతంలో విష్ణువని అంటారు. భక్తి ప్రధానంగా భగవంతుని చేరుకోవడమే మోక్షము. శరణాగతి ప్రసంగంలేదు. వీరి ప్రకారమూ కొందరు పరమ పాతకులు నీచ లోకాలలో మగ్గు తూంటారు కాని వారికి మఱి మోక్షము కలుగదు.

ఈ అద్వైతం లోను, విశిష్టాద్వైతంలోను, ద్వైతంలోని కూడా చాలా చాలా వర్గాలు వచ్చేయి. ఉదాహరణకు బ్రహ్మ సత్యం అని ధ్యానం చేస్తే శరీరం పోయిన తరువాత మోక్షము వస్తుందనే వారు ధ్యాన నియోగవాదులు. ప్రపంచాన్ని మన భావన ద్వారా లేదని గుర్తించ గలగడం ద్వారా మోక్షం పొందుతాం అని చెప్పేవారు నిష్ప్రపంచీకరణ నియోగవాదులు. శాంకరాద్వైతులు తత్త్వమసి లాంటి వాక్యార్థజ్ఞానము వలన ఈ జన్మలోకూడా మోక్షం పొందవచ్చునంటారు.

ఇలాగే చైతన్య మహాప్రభు ప్రచారంచేసిన అచింత్య భేద అభేద వాదము కూడ మరియొకటి. వల్లభాచార్యులు శుద్ధాద్వైతం ప్రవచించేరు. నింబార్కులు చెప్పిన ద్వైతాద్వైతము వేరొకటి.

ఇలా ఎన్నెన్నో తరువాతి కాలాలలో మతాలరూపాలలో రూపు దిద్దుకొని నలుదిక్కులా వ్యాపించేయి. ఉదాహరణకు భగవద్రామానుజులు ఉపదేశించినది శ్రీవైష్ణవము అయితే దీనిని శ్రీ సంప్రదాయమని అంటారు. అంటే నారాయణుడు లక్ష్మీదేవికి ఉపదేశించినది, ఇలాగే బ్రహ్మ సంప్రదాయమనీ, రుద్ర సంప్రదాయమనీ, సనక సంప్రదాయమనీ వేర్వేరు వైష్ణవ మతాలున్నాయి.

మనకిప్పుడు ఇబ్బంది ఏమిటంటే ఇప్పుడు ఈ మతాలూ, సంప్రదాయాలు కొన్ని కలగలసి పోయి విషయ వైశద్యము, సంప్రదాయ వివేకము తగ్గి పోతున్నది. శైవాన్ని అద్వైతాన్ని పర్యాయపదాలుగా వాడేవాళ్ళు కొందరైతే, విశిష్టాద్వైతంలో కూడా పరమాత్మకు రూపం లేదనే వారు కొందరు, కర్మలు చేయనక్కర లేదనేవారు మఱి కొందరు, అందరు దేవుళ్ళూ ఒక్కటే మనం ఎవరిని కావాలంటే వారిని ఆరాధించుకోవచ్చు, అసలు దేవుడికి రూపం లేదనేవారు ఇంకొందరు, ఇలా వివిధ రకాలైన సంకర ప్రవృత్తులు తలెత్తుతున్నాయి. శ్రీశ్రీశ్రీ త్రిదండ శ్రీరంగ రామానుజ జీయర్ స్వామి వారు ఇటువంటి సందేహాలు తీర్చటానికి అత్యంత సరళంగా కథారూపాలలో పరమాత్మ దేవుళ్ళు మనము అనీ దాని క్రమం లోనే ఆయనెవరు నేనెవరు అదేమిటి అని ఱెండు గ్రంథాలు అనుగ్రహించేరు. జిజ్ఞాసువులు ఆ గ్రంథాలను తప్పక అధ్యయనము చేయవలెను.

భగవద్రామానుజులు తన శ్రీభాష్యమనే గ్రంథంలో చాలా వివరంగా అప్పటి కాలంలో ప్రచారంలో ఉన్న వేరు వేరు దర్శనాలను, వాటి లోటు పాట్లను విశిష్టాద్వైతం యొక్క గొప్పదనాన్ని అనుగ్రహించేరు. అది 545

సూత్రములకు భాష్యమనుగ్రహించిన మహద్గ్రంథము. దానిలో మొదటి నాలుగు సూత్రాలను చతుస్సూత్రి అని అంటారు.

కొందరు మిత్రుల కోరిక మేరకు దాసుడు భగవద్రామానుజులు కటాక్షించిన శ్రీభాష్యమ్ చతుస్సూత్రి లో కొన్ని విషయాలను శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరంగ రామానుజజీయరు స్వామివారనుగ్రహించిన గ్రంథాలు మూలముగా, స్ఫూర్తిగా దాసుడి అమ్మగారికీ దాసుడికీ జరిగే చర్చారూపంగా అందించడానికి ప్రయత్నిస్తున్నాడు.

దాసుడు పూర్వ పక్షమును, అమ్మగారు సిద్ధాంతమును అందించుతున్నట్లు ఉంటుంది. దాసుడి సామర్థ్యపు అభావము వలన శాస్త్రపు లోతులకు వెళ్ళ కుండా పైపైన కొన్ని తర్కం చర్చల అందాలు మాత్రం కొలదిమాత్రం అందించే ప్రయత్నమిది. పెద్దలు తప్పులు సరిదిద్దమని  సవినయ విన్నపములు

అఖిల భువనజన్మస్థేమభంగాదిలీలే

వినత వివిధ భూత వ్రాత రక్షైక దీక్షే

శ్రుతి శిరసి విదీప్తే బ్రహ్మణి శ్రీనివాసే

భవతు మమ పరస్మిన్ శేముషీ భక్తిరూపా